సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఆదివారం
7.1.2024



# కోరికలు తీర్చే
# కొమరువెల్లి మల్లన్న

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తెలంగాణ నుంచి లోక్‌సభకు పోటీ చేసే విషయంపై ఆ పార్టీలో చర్చోపచర్చలు జరుగుతున్నట్లు కనిపిస్తోంది. తెలంగాణ నుంచి సోనియా గాంధీ పోటీ చేయాలని గత కొంత కాలంగా రాష్ట్ర పార్టీ నాయకత్వం కోరుతోంది. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గత నెలలోనే తీర్మానం చేసి, అధిష్ఠానానికి పంపారు. రెండోసారి జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలోనూ ఆమె తెలంగాణ నుంచి పోటీ చేయాలన తీర్మానం చేసి పంపించారు. దీంతో ఆమె సూత్రప్రాయంగా అంగీకరించి, దాదాపుగా ఆమె ఖమ్మం ఎంపీ స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు కనిపిస్తోంది. మీరేమంటారు.**

**కె. విజయకుమారి, ఖమ్మం**

మీరన్నది నిజమే విజయకుమారిగారూ... తెలంగాణ పిసిసి తీర్మానం మేరకు ముందుగా నిజామాబాద్, మల్కాజిగిరి స్థానాలు తెరపైకి వచ్చినా.. ఫైనల్‌గా ఖమ్మం నుంచి పోటీ చేసేందుకు సోనియా సిద్ధమైనట్లు తెలిసింది. ఖమ్మం నుంచి పోటీ చేయటం ద్వారా తెలంగాణలోనే కాకుండా, ఏపీపైనా ప్రభావం ఉంటుందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే కర్ణాటకలో ఆ పార్టీ అధికారంలో ఉండగా.. ఇటీవల తెలంగాణలోనూ పాగా వేసింది. ఇక ఏపీలోనూ సత్తా చాటాలని హస్తం నేతలు భావిస్తున్నారు. అందులో భాగంగానే వేగంగా పావులు కదుపుతున్నారు. వైసీపీ, టీడీపీకి చెక్ పెట్టేందుకు షర్మిలను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. గురువారం ఆమె వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసి హస్తం గూటికి చేరారు. దీంతో ఏపీపీసీసీ బాధ్యతలు షర్మిలకు కట్టబెట్టి రాష్ట్రంలో సానుకూల ఫలితాలు రాబట్టాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

అందులో భాగంగానే రెండు రాష్ట్రాల్లో సరిహద్దు పార్లమెంట్ నియోజకవర్గమైన ఖమ్మం ఎంపీ స్థానం నుంచి సోనియాను బరిలోకి దింపాలని కాంగ్రెస్ భావిస్తోన్నట్లు సమాచారం. సోనియా గెలవటానికి ఖమ్మం సీటు సేఫ్ అని.. పొంగులేటి, షర్మిలకు బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. సోనియాగాంధీ తెలంగాణ నుంచి పోటీ చేస్తే ఆమె సౌత్ నుంచి పోటీ చేయడం ఇది రెండోసారి అవుతుంది. గతంలో 1999లో కర్ణాటకలోని బళ్లారి నుంచి సోనియాగాంధీ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బీజేపీ నేత సుష్మా స్వరాజ్‌ను సోనియా ఓడించారు. తర్వాత మళ్లీ పాతికేళ్లకు సోనియా దక్షిణాదిలో భాగమైన ఖమ్మం నుంచి పోటీ చేయడానికి రెడీ అవుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ కూడా గతంలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి పోటీ చేశారు. 1978లో కర్ణాటకలోని చిక్‌మగళూరు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1980లో మెదక్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

**దేశంలోని బ్యాంకులపై గట్టి నిఘా పెట్టిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించిన వాటికి వరుసపెట్టి షాకులు ఇస్తోంది. చిన్న బ్యాంకుల నుంచి పెద్ద వాటి వరకు ఈ జాబితాలో చేరుతుండడం ఆందోళన కలిగిస్తోంది. అయితే, ఎక్కువగా కోఆపరేటివ్ బ్యాంకులు నిబంధనల ఉల్లంఘనలు చేస్తున్నట్లు తేలుతోంది. ఈ విషయంపై మీరేమంటారు**

**వి. రాజ్యలక్ష్మి, బెంగళూరు**

మీరు చెపుతున్న విషయం నిజమే మేడమ్... రెగ్యులేషన్ రూల్స్ అతిక్రమించినట్లు గురించిన ఆర్‌బిఐ తాజాగా మరో 5 బ్యాంకులపై చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో గుజరాత్ కేంద్రంగా పని చేస్తున్న 5 కోఆపరేటివ్ బ్యాంకులపై భారీగా పెనాల్టీలు విధించింది. ఈ పెనాల్టీలు రూ.50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు ఉన్నాయి. 2023, డిసెంబర్13వ తేదీన వడోదరా కేంద్రంగా పని చేస్తున్న శ్రీ భారత్ కోఆపరేటివ్ బ్యాంక్ పై రూ.5 లక్షలు పెనాల్టీ విధించినట్లు తెలిపింది. అర్బన్ ప్రైమరీ కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా ఇతర బ్యాంకులతో డిపాజిట్ల ప్లేస్ మెంట్ పై ఇచ్చిన ఆదేశాలను పాటించనందుకు, 2016 నాటి డిపాజిట్ల ఆదేశాలపై వడ్డీ రేటుపై నిబంధనలు ఉల్లంఘించి నందుకు గానూ ఈ పెనాల్టీ విధించినట్లు తెలిపింది. రెగ్యులేటరీ నిబంధనలను పాటించకపోవడం, బ్యాంకు తన కస్టమర్లతో కుదుర్చుకున్న ఏదైనా ట్రాన్సాక్షన్ లేదా ఒప్పందం చెల్లుబాటుపై వివరాలు వెల్లడించకపోవడంతో ఈ 5 బ్యాంకులపై మానీటరీ పెనాల్టీలు వేసినట్లు తెలిపింది.మరోవైపు.. 2023, డిసెంబర్ 7వ తేదీన ఇచ్చిన మరో ఉత్తర్వులో.. డైరెక్టర్లు, బంధువులు, సంస్థలకు రుణాలు, అడ్వాన్సులపై ఆదేశాలను పాటించనందుకు గుజరాత్‌లోని ఛోటాడేపూర్ జిల్లా, సంఖేడాలో ఉన్న సంఖేడా నాగరిక్ సహకారి బ్యాంక్‌పై రూ. 5 లక్షల మానీటరీ పెనాల్టీ వేసినట్లు తెలిపింది. ప్రాథమిక సహకార బ్యాంకుల ద్వారా ఇతర బ్యాంకులలో డిపాజిట్లపై నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ పెనాల్టీలు వేసినట్లు తెలిపింది. అలాగే.. డిసెంబర్ 8, 2023 రోజున కచ్ జిల్లాలోని భుజ్ కమెర్షియల్ కోఆపరేటివ్ బ్యాంకుపై రూ.1.50 లక్షలు జరిమానా వేసినట్లు తెలిపింది. ఈ బ్యాంకు కేవైసీ నిబంధనలు పాటించకపోవడం, డిపాజిట్లపై వడ్డీ రేట్ల విషయంలోనూ అవకతవకలకు పాల్పడినట్లు తెలిపింది.

అలాగే డిసెంబర్ 13వ తేదీన దోహద్ జిల్లాలోని లిమ్డిలో ఉన్న లిమ్డి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకుపై రూ.50 వేలు పెనాల్టి వేసినట్లు తెలిపింది. డిపాజిట్ రేట్లపై ఇచ్చిన ఆదేశాలను పాటించలేదని తెలిపింది. అలాగే డిసెంబర్ 7వ తేదీన పర్లాఖేముండిలోని కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుపై రూ.1.50 లక్షలు పెనాల్టి విధించినట్లు వెల్లడించింది. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీల సభ్యత్వానికి సంబంధించి ఆదేశాలను పాటించకపోవడం, యూసీబీలపై నిబంధనలు, చట్టపరమైన ఆంక్షలను పట్టించుకోకపోవడంపై ఈ జరిమానా విధించినట్లు తెలిపింది.

---

## లెజెండ్

### తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన

# జ్ఞానానందకవి



తెలుగు పద్య కవులలో జ్ఞానానంద కవి స్థానం విశిష్టమైనది. తెలుగు పద్యానికి వన్నె తెచ్చిన గొప్ప కవి ఆయన. సురగాలి తిమోతి జ్ఞానా నందకవి 1922 జూలై 16వ తేదీన విజయనగరం జిల్లా బలిజపేట మండలం పెదపెంకి గ్రామంలో సురగాలి ఎలయ్య, పాపమ్మ దంపతులకు జన్మించారు. ఆరవ ఏటనే రచనలు రాయడం ప్రారంభించారు. భీమునిపట్నం బోర్డింగ్ స్కూల్‌లో 8వ తరగతి వరకు విద్యాభ్యాసానంతరం కాకినాడలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. అనంతరం ఆయన తొలిసారిగా 14వ ఏటనే అప్పటి విశాఖ జిల్లా అలజంగి గ్రామంలో తెలుగు పండితులుగా ఉపాధ్యా య వృత్తిలో చేరి,1982లో పదవీ విరమణ చేశారు.

వసంతగానం(1947), గాంధీ (1950), దేశబంధు, పాంచ జన్యము (1956), ప్రభంజనం, పర్జన్యం (తొలి భాగము)(1959), గోల్కొండ, క్రీస్తు చరిత్ర (1963), విజయాభిషేకం (1966), పర్జన్యం (రెండో భాగము)(1969), అక్షరా భిషేకం (1971), ఆమ్రపాలి (1972), అక్షరాక్షతలు (1973), అక్షర గుచ్ఛము (1975), వెలుగు బాట (1976), క్రీస్తు ప్రబంధం (1977), క్రీస్తు ప్రబంధం తొలి భాగము (1992), నా జీవిత గాథ తొలిభాగం (1977), అక్షర పూజ (1979), హరిజనులు అంట రాని వారా (1980), పిల్లన గ్రోవి (1982), రాజధాని (1987), వంశ ధార (1989), ది విజన్ ఇన్ ది వర్సస్ ఆఫ్ డాక్టర్ జ్ఞానందకవి (1990), కూలీ నుండి కళాప్రపూర్ణ వరకు (1988), ధర్మాగ్రహము (1998), వివేకానంద గానం (2004), రెండు వేల పద్యాలతో క్రీస్తు ప్రబంధం, మన దేశం, రోజలు మారాలి (లఘునాటిక) బాష్ప సందేశం, పిల్లన గ్రోవి, రాజధాని, ఆహ్వానం, రెండంకితాలు, ఆరు దశాబ్దాల కవితా పరిశ్రమ, అభినం దన పద్యగద్య వ్యాస సంపుటిలతో పాటు జ్ఞానందకవి చేసిన పలు రచనలు విశేష ప్రాచుర్యం పొందాయి.

విజయవాడలో 1950 మే 20వ తేదీన కవికోకిల, కాకినాడలో 1961ఏప్రిల్ 24న కవిలోక విభూషణ, 1968 నవంబర్ 10వ తేదీన విద్వత్ కవి చూడామణి, 1968 నవంబర్ 15వ తేదీన సాహితీ వల్లభ, 1974 జనవరి 27న మహాకవి, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో 1974 ఆగష్టు 3వ తేదీన కళాప్రపూర్ణ, విజయవాడలో 1974 సెప్టెంబర్ 29వ తేదీన అభినవ జాషువ, బొబ్బిలి చిలుకల పల్లిలో 1975 సెప్టెంబర్ 28వ తేదీన సాహితీ కృషి వల, 1979 అక్టోబర్ 28న కవి సార్వభౌమ, విశాఖ, రామచంద్ర పురంలో 1982 సెప్టెంబర్ 28వ తేదీన కవితా శ్రీనాథ, 1982లో పద్యవిద్యా ప్రభు, విజయనగరం జిల్లాలో 1987 డిశంబర్ 7న కవితా విశారద, 1988లో నాటి ముఖ్య మంత్రి ఎన్‌టి.రామారావు చేతుల మీదుగా కవి సార్వభౌమ బిరుదు పొందారు. 1991లో భారత ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు,1991 ఫిబ్రవరి 7వ తేదీన బ్రహ్మీ విభూషణ, 1996లో డి.లిట్ స్వీకరించారు. ఆయన రచనలు, జీవితంపై ఐదు విశ్వ విద్యాల యాల్లో పరిశోధనలు జరిగాయి. ఆయన రచనలు పలు విశ్వ విద్యాలయాల్లో పాఠ్యాం శాలుగా ఉన్నాయి. జ్ఞానానందకవి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ యాక్ట్ రివ్యూ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమీ, ఆంధ్ర విశ్వ విద్యాలయ అకాడమీ కౌన్సిల్, తూర్పు గోదావరి జిల్లా రెడ్‌క్రాస్ సంఘం, తూర్పు గోదావరి జిల్లా గ్రంథలాయ సంస్థ సభ్యుడిగా పలు పదవులు నిర్వహించారు. సాహితీ సంస్థలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. 1967లో సాహితీ సమాఖ్య, 1972లో సాహి త్య కళాపీఠం, 1980లో జాషువా కవి సాహిత్య పీఠాల్ని ఏర్పాటు చేశారు.

కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, బెజవాడ గోపాల్ రెడ్డి, ఆచార్య ఎన్జీ రంగ, డాక్టర్ సి నారాయణ రెడ్డి, అయ్యదేవర కాళేశ్వర రావు, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని, దేవులపల్లి రామానుజ రావు, జస్టిస్ ఆవుల సాంబ శివ రావు, డాక్టర్ నండూరి రామ కృష్ణమా చార్య, డాక్టర్ కొలుకలూరి ఇనాక్, ఆర్‌ఎస్ సుదర్శనంలతో పాటు నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రత్యేకంగా అభినందించిన వారిలో ఉన్నారు. భారత దివంగత రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ నుండి 2000 సంవత్సరంలో జ్ఞానంద కవి అత్యున్నతమైన పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. ఆయన 2011 జనవరి 6 తేదీన లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

# నవ కవిత్వం

## గమ్యమొక్కటే



చీకటి లోయలో కాకుల గుంపు
చిరాకు పడుతూనే ఉంది
చికాకు పెడుతూనే ఉంది..
నీ వల్ల కానే కాదంటూ,
నడక వీల్లేదంటూ.
బురద మడుగులో మొసళ్ల జంట,
పొదల్లో చేరిన తోడేళ్ళ మంద
నొసలు చిట్లిస్తున్నాయి
కన్నీళ్లతో నస పెడుతున్నాయి..
ముందుకెళ్లడం ముప్పేనంటూ,
క్షమించరాని తప్పేనంటూ.
ముందు నిలిచిన గమ్యమొక్కటే
రారమ్మని పిలుస్తోంది
భుజం తట్టి వెల్తురు పరుస్తోంది
మిత్రమా,
నీ యాత్ర నువ్వే చెయ్యాలంటూ..
నీ చరిత్ర నువ్వే రాయాలంటూ.


**– డా. డి వి జి శంకరరావు,**
**మాజీ ఎంపీ, పార్వతీపురం.**
**9440836931**

# లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ఉత్తర ద్వార దర్శనం కోసం జరిగే తతంగం గురించి విపులంగా వివరించిన తిరు చాలా నచ్చింది. రచయితకు ధన్యవాదాలు. వివిధ సందర్భాలను ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్టు చూపించిన రచయితకు , ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉ పయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు


**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**


# కాలచక్రం




సెకను గా పుట్టి
నిమిషాలుగా ఎదిగి
గంటలుగా గడిచి
రోజులుగా మారి
వారాలుగా చేరువై
పక్షాలుగా పరిఢవిల్లి
నెలలు గా నెలవై
అమావాస్య చీకట్లను
నిండు పున్నమి గా మార్చి,
వత్సర దీర్ఘాయుష్షు పొందాను
నా సాహచర్యంలో నీ ఆశయాలు
శ్వాస తీసుకొని ఉండకపోవచ్చు
నాతో పెనవేసుకున్న నీ ఆలోచనలు
నాతో ముడిపడి ఉండకపోవచ్చు
నీలో కదలాడే ఊహలకు,ఊసులకు
నేను ఊపిరిపోసి ఉండకపోవచ్చు
నువ్వు పెంచుకున్నపసిడి ఆశలకు
నేను రెక్కలు తొడిగి ఉండకపోవచ్చు
నువ్వు కట్టుకున్న జీవిత సదనానికి
నేను కొత్త రూపు ఇచ్చి
ఉండకపోవచ్చు
నా లోగిలిలో ఎన్నో సంఘటనలు
నిన్ను నిరుత్సాహపరచి ఉండవచ్చు,
నువ్వు అవమాన పడివుండవచ్చు,
నువ్వు నొచ్చుకొని ఉండవచ్చు
గడిచిన క్షణాలను యుగాలుగా
తలచుకుంటూ ఆగిపోవద్దు
నా సాన్నిధ్యంలో నీకొచ్చిన కష్టాలను,
కన్నీళ్ళను నాతోనే తీసుకెళతా
ఆ బాధను నాతోనే మోసుకెళతా
గతం ఒక జ్ఞాపకం–
దానికై చింతించకు
వర్తమానం ఒక అవకాశం–
అందిపుచ్చుకో
భవిష్యత్తు ఒక జ్ఞాపిక–
చేజార్చుకోకు
నా అస్తమయం మరో నవోదయం
నీ కష్టాలు కనుమరుగైపోవాలని,
కొత్త ఉత్సాహం
నీలో ఉర్రూతలూగాలని
నూతన వత్సరపు అరుణోదయ కాంతి
జీవితాన్ని మరింత ప్రకాశవంతంగా,
పూల తోట వంటి వెలుగు బాటలో
నిత్యనూతనంగా ప్రభవింపజేయాలని
ఆశల ఆశయ గమ్యానికి చేరుకోవాలని
2024– సహచర్యం మీకు
సంతోషాల హరివిల్లు కావాలని
ఆశిస్తూ.......
కోటి ఆశల
కొంగొత్త వత్సరానికి స్వాగతం
ఊహల పల్లకీల ఉత్సవానికి
స్వాగతం
జయజయ ధ్వానాల
ఆనంద కరతాళ ధ్వనులతో
2024 కి స్వాగతం
నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**ధూళిపాళ్ళ మాధవికిషోర్**
**9949735253**







నారు

# సూర్య బుడత

**బాలల కథ**


## నైతిక విజయం


గోమతి రాజ్యాన్ని విక్రమార్కుడు పరి పాలించేవాడు.ప్రజలకు ఏం కష్టం రానీయకుండా జనరంజకంగా పాలిస్తూ అందరి మన్ననలను పొందేవాడు. తన రాజ్యం సుభిక్షంగా ఉండాలని ఎప్పటి కప్పుడు అన్ని శాఖల తో సమావేశమై ప్రజల కష్టాలను తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరించేవాడు.ఒకోసారి మారు వేషంలో ప్రజలలోకి వెళ్ళి వారి ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుని మంత్రి ద్వారా తీర్చేవాడు.ప్రజలందరూ విక్రమార్కుని పరిపాలనలో ఆనందంగా జీవించేవారు.విక్రమార్కునికి తన ప్రజల శ్రేయస్సే ముఖ్యం. ఇతర రాజ్యాల పై యుద్ధం చేసి ఆక్రమించాలనే ఆలోచన ఉండేది కాదు.అలాగని తన రాజ్యం పై ఎవరైనా యుద్ధానికొస్తే ధైర్యంగా ఎదు ర్కొని తరిమేవాడు.ఏ నాడు యుద్ధం లో ఓటమి చవిచూడలేదు.చుట్టూ ఉన్న రాజ్యాల రాజులు విక్రమార్కుడుతో గెలవలేమని గోమతి రాజ్యంపై కన్నెత్తి చూసేవారు కాదు.ఒక రోజు గోమతి రాజ్యంలో సగం మంది ప్రజలకి, సైని కులకి ఓ వింత వ్యాధి సోకింది.విక్రమా ర్కుడు ఆందోళన చెందాడు.వెంటనే తన రాజ్యం లోని వైద్యులకి ఆ వింత వ్యాధిని నయం చేయమని ఆదేశిం చాడు.ఎంత వ్యయమైనా నయం చేయమని చెప్పాడు.వైద్యులు ఆ వింత వ్యాధి నయం చేసే పనులో తలమునక లయ్యారు.ఇంతలో గోమతి రాజ్యాన్ని ఎలాగైనా ఆక్రమించాని గతంలో ఐదు సార్లు విక్రమార్కుని చేతిలో ఓడిపోయిన పొరుగు శాకుంతల రాజ్యం రాజు దేవ సేనుడు ఈ సారి ఎలాగైనా గెలవాలనికంకణం కట్టుకుని, యద్ధానికి వస్తున్నట్టు తన వేగుల ద్వారా విక్రమార్కునికి వర్త మానం పంపాడు. తన రాజ్యం లో సగం మంది ప్రజలకి, సైనికులకి వింత వ్యాధి సోకిన తరుణంలో యుద్ధం ఎలా వెళ్లాలని ఆలోచనలో పడ్డాడు విక్రమార్కుడు.తన ప్రజలకి వైద్యం చేయిస్తూ,తన రాజ్యాన్ని కాపాడు కోవడమే తన ముందున్న కర్తవ్యం.


యుద్ధానికి తగిన సంఖ్యా బలం లేక పోయినా గెలవకపోతే తన ప్రజలు వారికి బానిసలు గా బ్రతకాలని మొక్క వోని ధైర్యం తో యుద్ధానికి మిగిలిన సైన్యాన్ని సన్నద్ధం చేసాడు విక్ర మార్కుడు. విక్రమార్కునికి,దేవసేనుడికి మద్య భీకర యుద్ధం జరిగింది.తగిన సంఖ్యా బలం లేకపోవడంతో దేవసేనుడి చేతిలో విక్రమార్కుడు మొదటి సారిగా ఓడిపోయాడు.దేవసేనుడి ఆనందానికి హద్దులు లేవు.ఎప్పుడు ఓడని విక్రమార్కుడు ఈ సారి ఎందుకు ఓడాడని దేవసేనుడికి సందేహం కలిగింది.వెంటనే వేగుల ద్వారా కారణం తెలుసుకోమని ఆదేశించాడు దేవసేనుడు.ఓటమికి గల కారణం తెలుసుకున్న వేగులు చెప్పిన మాటలు విని దేవసేనుడు ఆశ్చర్యపోయాడు.తను రాజ్యాన్ని ఆక్రమించాలనే కాంక్షతో ఇన్నాళ్లు ఆలోచించానే కాని ఏ రోజు ప్రజల శ్రేయస్సును కోర లేదని, విక్రమార్కుడు ప్రజల శ్రేయస్సు చూస్తూ కూడా యుద్ధం లో వీరోచితంగా పోరాడని గ్రహించాడు.వెంటనే విక్రమార్కుడిని కలిసి"విక్రమార్కా! యుద్ధం చేయడమంటే శత్రు రాజులను ఓడించటమే కాదు.ప్రజల శ్రేయస్సును కూడా చూడాలని నీవు నిరూపించావు.తగిన సంఖ్యా బలం లేకున్నా, ప్రజలు, సైనికులు వింత వ్యాధితో బాధపడు తున్నా వారికి వైద్యం చేయస్తూనే నాతో యుద్ధానికి తలపడ్డావు.నిజమైన వీరు డివి నీవే.ఈ యుద్ధం లో నీవు ఓడిపో యినా నైతిక విజయం నీదే.కనుక నీ రాజ్యాన్ని నీకేఇచ్చేస్తున్నాను.ఇంకె ప్పుడు ఏ రాజ్యం పై యుద్ధం చేయను. నా రాజ్యంలో ప్రజలను సుభిక్షితంగా


చూసుకుంటాను"అని చెప్పి గోమతి రాజ్యాన్ని విక్రమార్కుడికి అప్పగించి వెనుతిరిగి వెళ్ళిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న పొరుగు రాజ్యాల రాజులు రాజు అంటే యుద్ధం చేసేవాడే కాదు తన రాజ్యంలో ప్రజల శ్రేయస్సును కోరే వాడిని తెలుసుకుని యుద్ధాలు చేయడం మానుకుని తమ ప్రజల శ్రేయస్సు కోసం పరిపాలన చేయసాగారు.

– కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239








# దేవుడి భార్య



## సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

"మంచం మీద నగ్నంగా గంగ"

"చెదిరిన జుట్టు, నలిగిన పెదవులు. ఏ పెదవులో చెప్పాల్సిన అవసరం లేదు."

మంచానికి దూరంగా గంగ బట్టలు. ఈసరయ్యను చూడగానే టక్కున లేచి బట్టలు అందుకోబోయింది. ఈసరయ్య అమాంతం గంగను ఆక్రమించాడు. ఏం జరుగుతోందో ఒక్క క్షణం పాటు గంగకు అర్థం కాలేదు. విడిపించుకునే ప్రయత్నం చేయలేదు. శవంలా మంచం మీద పడుకుంది. ఈసరయ్య గంగ శరీరాన్ని, మానాన్ని దోచుకున్నాడు. గంగ కంట్లో నుండి కన్నీరు వాగులుగా, వంకలుగా, నదులుగా, సముద్రాలుగా ఇప్పుడు గంగ ఈసరయ్యను అయ్యా అని ఎలా సంబోధించగలదు? ఏమని పిలవాలి? గంగకు, ఈసరయ్యకు మధ్య ఉన్న సంబంధం వేశ్య, విటుల సంబంధమా? ఆడదాని శరీరానికి వావి వరసలు ఉండవా? మగవాడు తన కామవాంఛ తీర్చుకోడానికి ఎవరినైనా చేరుస్తాడా? గంగ వేశ్యగా ఉండవచ్చు అది తన నిర్ణయం, తన నిస్సహాయత, తన అమాయకత్వం, తన నిర్లక్ష్యం, తన హద్దు, తన ఇష్టం, తన తెగింపు, ఏమీ చేయలేనితనం.

బిడ్డ వేశ్య అయితే తండ్రి బిడ్డను చెరుస్తాడా? వేశ్య కాకపోయినా చెరుస్తున్న తండ్రులు, అన్నలు, బావలు, మామలు ఇంకా అనేకమంది కుటుంబ సభ్యుల మధ్య ఉన్న మహిళల శరీరాలకు రక్షణ ఎక్కడ?.

బయటివాడు మానభంగం చేస్తేనే చెప్పుకోలేని మానసిక స్థితిలో ఉన్న మహిళలు ఇక ఇంట్లో వారి శారీరక దాడుల గురించి చెప్పుకోగలరా? ఎప్పటివరకు ఈ శారీరక హింస? ఎప్పటి వరకు ఈ కామవాంఛ?.

ఈసరయ్య తన కామవాంఛ తీర్చుకొని వెళ్ళిపోయాడు. గంగ అలానే నగ్నంగా శవంలా పడుకుంది. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాసిపోయాయి. కడుపు కింద, తొడల మధ్య ఉన్న తన శరీర భాగాన్ని చిదిమేయాలనుకుంది. కోపం, ఆక్రోశం, బాధ, అసహ్యం, చీదర ఎవరిపైనో తెలియదు. తెల్లారేవరకు కంటికి కునుకు లేకుండా అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత లేచి తన రోజువారీ జీవితంలో మునిగిపోయింది.

అన్నం వడ్డించేటప్పుడు కన్ను కొట్టాడు, యద వైపు కసిగా చూశాడు. స్నానానికి వేడి నీళ్లు తోడినప్పుడు, వీపు రుద్దుతున్నప్పుడు ఇతర శరీర భాగాలను కూడా రుద్దమన్నాడు. మల్లెపూలు తెచ్చాడు, కొత్త చీర కట్టుకోమన్నాడు. నీ గదిలో సౌకర్యంగా లేదు నా గదిలోకి వస్తే కమ్మగా ఉంటుదన్నాడు.

ఈసరయ్య గదిలోకి గంగ వెళ్ళలేదు, మల్లెపూలు పెట్టుకోలేదు, కొత్త చీర కట్టుకోలేదు. ఈసరయ్య గంగ గదిలోకి వచ్చాడు. బలవంతం చేశాడు, చేతులు వేశాడు, బుగ్గలను నిమిరాడు, మంచంపై పడేసి కుమ్మాడు, గుద్దాడు. గంగ సహకరించలేదు.

'ఏమే లంజ? ముసిలోడిది బాగా లేదా?'

'ఇదిగో ఐదు వందలు తీసుకొని నోరు మూసుకొని పడుండు. నీ యవ్వారం తెలియదు అనుకున్నావా? ఇంటికి ఎవరెవరు వస్తున్నారో, ఏమేమి చేస్తున్నారో, ఎంత ఇస్తున్నారో, తెలుసుకోలేని వెధవని అనుకున్నవా?.'

గంగ నోటి నుండి మాట రాలేదు. తన విషయం తెలిసినందుకు కాదు. తండ్రిగా భావించిన వాడే లంజ అనే సరికి గంగ నోరు పడిపోయింది. ప్రతిఘటించేందుకు శరీరం సహకరించలేదు.

గంగ కోసం ఎవరూ ఇంటికి రావడం లేదు. గంగ కూడా ఎవరి కోసం ఎదురుచూడటం లేదు. ఈసరయ్య ఎవరిని రాకుండా చేశాడు. గంగ తనకు మాత్రమే సొంతం అవ్వాలనుకున్నాడు. బీవి ఇంటికి వెళ్ళడం మానేశాడు.

***

నేను లంజే కావచ్చు, పదిమందితో పడుకుండే ముండనే కావచ్చు, డబ్బు కోసమో, అవసరాల కోసమో, కోరికల కోసమో గతిలేక బుద్ది గడ్డి తిని పాడుపని చేసి ఉండవచ్చు కాని వావి వరసలు మరిచి నా శరీరాన్ని తండ్రి లాంటి వాడు అనుభవిస్తూ ఉంటే ఎలా ఉండగలను? ఈ విషయం అమ్మా, నాన్నలకు తెలిస్తే నా ముఖంపై ఉమ్మేస్తారు, ఊళ్లో మర్యాద ఉంటుందా? ఇక నేను ఇంటికి వెళ్ళలేని, ఇక్కడ ఉండలేను ఎక్కడికైనా వెళ్లిపోవాలి.

నా అనుమతి లేకుండా నా శరీరంపై బలవంతం చేయని చోటుకు వెళ్లిపోవాలి. అలాంటి ప్రదేశం ఎక్కడా లేదని గంగ తెలుసుకోలేకపోయింది. ప్రపంచమంతా దీపం పట్టుకొని తిరిగినా కూడా అలాంటి చోటు లేదు, ఉండదు. మహిళలకు శ్రేయస్కరమైన ప్రదేశం ఈ దేశంలో, ప్రపంచంలో ఉన్నదా? ఉంటే ఎక్కడ ఉంది? మహిళలు చనిపోయిన తర్వాత గుంతలో పూడ్చిన శవాలను బయటకు తీసి సంభోగం చేస్తున్న ఈ ప్రపంచంలో స్త్రీల శరీరాలకు భద్రమైన చోటు ఎలా దొరుకుతుంది?.

గంగ మనసు విరిగిపోయింది. ఎవరిని నమ్మబుద్ధి కాలేదు. ఎవరిని చూసినా అనుమానంగా అనిపించింది. ఈసరయ్య ఇంటికి రాగానే తన ఇష్టంతో సంబంధం లేకుండా శారీరకంగా హింసించాడు. తన జతగాళ్లను ఇంటికి తెచ్చి వాళ్ల భార్యలు పుట్టింటికి పోయారు.. ఒక పూట అన్నం పెట్టడానికి తీసుకువచ్చాను. వాళ్ల కోసం కూడా అన్నం వండు, రాత్రికి పక్కలో పండు అన్నాడు.

ఇష్టంతో అన్నం వండింది, అయిష్టంగా పక్కలో పడుకుంది. ఈసరయ్య, తన జతగాళ్లు గంగ శరీరాన్ని పీల్చి పిప్పి చేశారు. ఎక్కడ పడితే అక్కడ గుద్దారు, బీడీలతో కాల్చారు, కడుపులో తన్నారు. గంగ శారీరకంగా కంటే మానసికంగా కుంగిపోయింది.

గంగ మనసుతో కాని, శరీరంతో కాని వాళ్లకు ఎటువంటి సంబంధం లేదు. మందులో నంజుకోడానికి గంగ శరీరం, తాగిన తర్వాత గంగను అతలాకుతలం చేస్తారు. వస్తువును విసిరేసినట్టు విసిరేస్తారు. ఒకరు తర్వాత ఒకరు, ఒకరి మీద ఒకరు, అందరూ కలిసి గంగను అనుభవించారు.

గంగ అలసిపోయింది. శారీరకంగా కాదు మానసికంగా. ఒంట్లో శక్తి కుశించుకుపోయింది. మొన్నటి వరకు తాజాగా ఉన్న గంగ వాడిపోయిన పువ్వులా వేలాడింది. ఏదీ తినబుద్ధి కాలేదు. ఏది తిన్నా వాంతి అయ్యింది. కాళ్ళు, చేతులు గుంజుట, తల తిరుగుట, కడుపులో వికారంగా అనిపించడం జరిగింది.

నెలసరి రాలేదు. మూడు నెలల్లో పూర్వం ఉన్న కడుపు కంటే కాస్త పెద్దగా అయ్యింది. ఇంకొన్ని రోజులు ఆగితే ఇంకాస్త పెరుగుతుంది. గంగ గర్భం దాల్చింది, తల్లి కాబోతోంది. ఎవరి బిడ్డకు తల్లి కాబోతోందో తనకు అవసరం లేదు. తన కడుపులో బిడ్డ పెరుగుతోంది కనుక అది తన బిడ్డే అనుకుంది.

కామంతో కళ్ళు మూసుకుపోయిన వాడికి పిల్ల అయితే ఏంటి? ముసల్ది అయితే ఏంటి? కన్న కూతురు అయితే ఏంటి? ఆఖరికి గర్భవతి అయితే ఏంటి? ఈసరయ్య గంగను బలవంతం పెట్టాడు. గంగను గదిలోకి లాక్కొని వెళ్ళాడు. తన జతగాళ్లను ఉసిగొల్పాడు. గంగ వేసుకున్న పైటను లాగారు, లంగా బొందెను తెంచారు. నేలపై గంగను కుదేసి ఒకరి తర్వాత ఒకరు గంగను రాత్రంతా అనుభవించారు.

గంగ మాట్లాడలేదు, మాట్లాడే ఓపిక లేదు, స్పృహ కోల్పోయింది. తనకు ఏం జరుగుతోందో అర్థం కాలేదు. గంగ తొడల మధ్య రక్తం చిమ్మింది, గర్భసంచి పగిలింది. గంగ కన్నుల్లో నుండి, ముక్కుల్లో నుండి, నోటి నుండి, చెవుల్లో నుండి అనేక శారీర భాగాల నుండి రక్తం.. రక్తం.. రక్తం. గంగ తన బిడ్డతో పాటు తనను కూడా కోల్పోయింది. గంగ.. పారే గంగలో కలిసిపోయింది.

తెల్లవారుజామునే మైకం దిగగానే గంగను చూసి ఈసరయ్య కంగుతిన్నాడు. వెంటనే జతగాళ్లను లేపాడు. అందరూ కలిసి గంగ శరీరాన్ని బొంతలో చుట్టి, ఒక పెద్ద గంపలోకి ఎత్తి దానిపై చెత్తా చెదారం వేసి ఊరి బయటకు తీసుకెళ్లి ఏట్లో విసిరేశారు.

అదంతా చూసిన ఈసరయ్య భార్య వణికింది, భయపడింది భర్తకు ఎదురు తిరగలేకపోయింది. ఎదురు తిరిగి ఏమీ చేయలేనని ఏడ్చింది. భర్త నీచపుపనులు చూసి తట్టుకోలేకపోయింది. ఇవన్నీ చూసి బతికే కంటే చనిపోవడమే మంచిదని భావించింది. స్మశానంలో శవానికి, ఇంట్లో తనకు పెద్ద తేడా లేదనుకుంది.

గంగ చనిపోయిన తర్వాత నుండి ఈసరయ్య బీవి ఇంటికి వెళ్ళేవాడు. బీవికి ఆరోగ్యం బాగుండటం లేదు. ఒకటే ఆయాసం, ఊపిరి సరిగా తీసుకోడానికి అవ్వడం లేదు. దగ్గి దగ్గి గుండెలు అదురుతున్నాయి. ఈసరయ్య బీవితో సుఖంగా గడుపుదామంటే కుదరడం లేదు. ఒంట్లో శక్తి లేదు అండి, నన్ను వదిలేయండి. నేను ఎక్కువ రోజులు బతకలేనని వేడుకుంది. ఈసరయ్యకు అటు భార్య దగ్గర, ఇటు బీవి దగ్గర సుఖం కరువైంది. ఏదో ఒకటి చేయాలి, ఎవరితోనైనా సుఖం పొందాలి. ఈసరయ్యకు కన్యపిల్లలు అంటే యావ, పిచ్చి, కొవ్వు, వ్యామోహం.

ఒకరోజు మెహతాజ్ స్నానం చేస్తుంటే చూశాడు, అదుపు చేసుకోలేకపోయాడు, కన్నబిడ్డ కాదని నచ్చ చెప్పుకున్నాడు. ఇంట్లోనే వేడి వేడి సరుకు పెట్టుకొని బయటకు వెళ్ళడం ఎందుకని? భావించాడు. మెహతాజ్ తో అదోలా మాట్లాడటం, నీకు పెళ్లి చేయాలి. మీ అమ్మ రేపో, మాపో అనేలా ఉందన్నాడు. పెళ్లి ఈడుకు వచ్చిన నీకు కోరికలు ఉండవా? నీ శరీరం ఏవేవో కోరుకోవా? ఎలా అదుపు చేసుకుంటున్నావని అడిగాడు.

తండ్రి స్థానంలో ఉన్న ఈసరయ్య అలా మాట్లాడేసరికి మెహతాజ్ బెదిరిపోయింది, వణికిపోయింది, భయపడిపోయింది, హడలిపోయింది. ఈసరయ్య అలా మాట్లాడుతున్నాడని తల్లికి చెప్పలేకపోయింది. అదే అదునుకున్నాడు ఈసరయ్య. మొదట మెహతాజ్ భుజాలపై చేతులేశాడు, బుగ్గలపై ప్రేమగా గిల్లాడు. ఆ తర్వాత మొరటుగా పిరుదులపై చరిచాడు, తొడలపై రుద్దాడు. తన కామ పన్నాగాన్ని విడతలు విడతలుగా అమలు పరిచాడు.

మెహతాజ్ చేసిన పొరపాటు, తప్పు తన తల్లితో చెప్పుకోలేకపోవడం, ఈసరయ్యకు ఎదురు తిరగకపోవడం. "అవే తప్పులు, అవే పొరపాట్లు మాటి మాటికి, పదే పదే కాలం మొదలైనప్పటి నుండి జరుగుతూనే ఉన్నాయి. ఎప్పటికి ఆగుతాయో!?."

ఒకరోజు హడావిడిగా బీవి ఇంటికి వెళ్లాడు ఈసరయ్య. రెండు వందలు చేతిలో పెట్టి ఊళ్లో రోగాలు, రొష్టులు ఎక్కువయ్యాయి త్వరగా ఆసుపత్రికి వెళ్లి చూయించుకో. మాయదారి రోగాలు వస్తే వేలు ఖర్చుపెట్టినా పోయే రోజులు కావివి. బీవి.. సరే అన్నట్టుగా తల ఊపింది. నాకు తలనొప్పొంది మెహతాజ్ ని తల పట్టమని చెప్పు. సరే అని బిడ్డకు చెప్పి ఆసుపత్రికి వెళ్ళింది.

నులక మంచం మీద లుంగీని లూజ్ గా కట్టుకొని కళ్ళు మూసుకొని, నుదుటిపై మోచేతిని పెట్టుకొని నిద్రపోయినట్టు నటించాడు.

'మెహతాజ్ గదిలోకి వచ్చి అయ్యా! తల పట్టనా?' అని అడిగింది.

'ఇలా రా కూర్చో అన్నాడు. ఇలా రామ్మ కూర్చో అని బిడ్డను పిలిచినట్టు పిలవలేకపోయాడు.'

'ఈసరయ్య తల వైపుకు కూర్చొని తల నొప్పిస్తోంది అన్నావంట! తల పడతాను పడుకో.'

'అవును నొప్పిస్తోంది. తల మాత్రమే కాదు ఒళ్ళంతా ఒకటే నొప్పులు వేడినీళ్లతో కాస్త కాపడం పెట్టు.'

కొద్దిసేపటి తర్వాత మెహతాజ్ వేడినీళ్లు తెచ్చింది. ఈసరయ్య చొక్కా విప్పి పడుకున్నాడు. తల మీద, వీపు మీద, ఛాతీ మీద, పొట్ట మీద వేడి నీళ్ల గుడ్డతో కాపడం పట్టింది.

'చేను కాడికి పోయాను కదా! కాళ్లు పీకుతున్నాయి. కాస్త కాళ్లు పట్టు, మోకాళ్లు పట్టు, తొడలు పట్టు అన్నాడు.'

మెహతాజ్ కి అసహ్యంగా అనిపించింది. ఏదో జరగరానిది జరుగుతున్నట్టు, తాను ఆ గదిలో ఉండటం శ్రేయస్కరం కాదనట్టు అక్కడి నుండి వెళ్ళాలనుకుంది.

'ఈసరయ్య మెహతాజ్ నడుము పట్టుకొని మీదకు లాక్కున్నాడు.'

'అయ్యా!'

'నోరు ముయ్'

'వద్దు అయ్యా! నీ బిడ్డను అయ్యా! నన్ను వదులు అని వేడుకుంది.' అలా కాకుండా ఎదురు తిరిగి దొమ్ములపై తన్ని ఉండాల్సింది.

గది నుండి బయటకు పరుగు పెట్టబోయింది. జుట్టు పట్టుకొని లాగాడు, బట్టలను చించాడు, వేడినీళ్లను మీదకు విసిరాడు, నోరు నొక్కి నులక మంచం మీద పడేశాడు.



రచన : జానీ తక్కెడసిలా
7259511956

# మీ వంటకు ఈ నూనె వాడితే.. గట్ ఆరోగ్యంగా ఉంటుంది..!

**గట్ హెల్త్ పైనే మన పూర్తి శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. గట్ అనేది.. నోరు, ఆస్యకుహరం, గ్రసని, ఆహార వాహిక, జీర్ణాశయం, చిన్నపేగు, పెద్దపేగు, పురీష నాళం, పాయువు వరకు ఉంటుంది. మనం తినే ఆహారాన్ని జీర్ణం చేయడంతోపాటు శరీరానికి అవసరమైన పోషకాలను శోషించుకొని వ్యర్థాలను బయటకు నెట్టివేయడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. మన పొట్టలో జీర్ణక్రియను సాఫీగా పూర్తి చేయడంతోపాటు రోగనిరోధక శక్తిని మెరుగుపరిచే.. లక్షలాది మంచి బ్యాక్టీరియాలు ఉంటాయి. అవువంటి గట్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. మన గట్ ఆరోగ్యానికి మేలు చేసే.. నూనెలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.**

## చియా గింజల నూనె..



చియా గింజల్లో ఒమేగా-3, ఒమేగా - 6 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఈ ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణక్రియ శ్రేయస్సుకు తోడ్పడతాయి. చియా గింజల్లో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. ఇది పేగు కదలికలను కూడా ప్రోత్సహిస్తుంది. చియా గింజల నూనె మీ గట్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. మీ సలాడ్స్‌లో చియా సీడ్ ఆయిల్ వేసుకుని తీసుకోండి. వంటకు ఈ నూనె వాడితే.. గుండెకు మంచిది..!

## పొద్దుతిరుగుడు నూనె..



పొద్దుతిరుగుడు నూనె ఆరోగ్యకరమైన పేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్‌లో విటమిన్ ఇ, ఒమేగా - 6 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి నుంచి గట్‌ను కాపాడతాయి, మీ జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడానికి సహాయపడతాయి. సన్‌ఫ్లవర్ సీడ్ ఆయిల్‌లో ఫైటోస్టెరాల్స్, లినోలెయిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ తగ్గించడానికి తోడ్పడతాయి.


## అవిసె గింజల నూనె..



అవిసె గింజల నూనె ఆల్ఫా-లినోలెనిక్ యాసిడ్ (%ూూూ%) అద్భుతమైన మూలం. అవిసె గింజల నూనె గట్ - ఫ్రెండ్లీ ఆయిల్. ఈ నూనెలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్ పుష్కలంగా ఉంటాయి, ఇది జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. సాధారణ పేగు కదలికను, వాపును తగ్గిస్తుంది. ఈ నూనెలోని యాంటీఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆరోగ్యకరమైన సమతుల్య గట్ వాతావరణానికి తోడ్పడతాయి. మాయో క్లినిక్ ప్రకారం.. కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గించడానికీ.. అవిసె గింజల నూనె సహాయపడుతుంది.

## గుమ్మడి గింజల నూనె..

గుమ్మడి గింజల నూనెలో యాంటీ ఆక్సిడెంట్ ప్రొఫైల్ ఉన్న గట్ ఫ్రెండ్లీ ఆప్షన్. గుమ్మడి గింజల నూనెలో విటమిన్ ఇ, కెరోటినాయిడ్స్



సమృద్ధిగా ఉంటాయి. ఇవి మీ పేగులను ఆక్సీకరణ ఒత్తిడి నష్టం నుంచి రక్షిస్తుంది. గుమ్మడి గింజల నూనెలో కరిగే ఫైబర్, మెగ్నీషియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ, పేగు కదలికలో ఫైబర్ కీలక పాత్రపోషిస్తుంది. మీ సలాడ్స్‌లో గుమ్మడి గింజల నూనె యాడ్ చేసుకుని తీసుకోవచ్చు.

## నువ్వుల నూనె..



నువ్వుల నూనె గట్ ఆరోగ్యానికి అద్భుతమైన ఆప్షన్. దీనిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలు నిండి ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడానికి తోడ్పడతాయి. నువ్వుల నూనెలో ఒమేగా-3, ఒమేగా-6, ఒమేగా-9 ఫ్యాటీ యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. నువ్వుల గింజల నూనెలో లిగ్నాన్స్ ఉన్నాయి. ఇది మంచి గట్ బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.

# ఇలా అయితే బరువు తగ్గడం ఖాయం..




బరువు తగ్గాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. ఇందులో ముఖ్యంగా న్యూట్రిషనిస్ట్ ఇచ్చే కొన్ని టిప్స్ గురించి తెలుసుకుని వాటిని స్ట్రిక్ట్‌గా ఫాలో అయితే బరువు ఈజీగా తగ్గుతారు. అందుకోసం న్యూట్రిషనిస్ట్ రుజుతా ఫుడ్ ఎలా తీసుకోవాలి. ఎలాంటి రొటీన్‌ని ఫాలో అవ్వాలో చెబుతున్నారు. మరి వాటి గురించి మీరు కూడా తెలుసుకోండి.

సీజనల్ ఫుడ్స్..
ప్రతి సీజన్‌లోనూ ఆ సీజన్‌కి తగ్గ కూరగాయలు, వెజిటేబుల్స్ దొరుకుతాయి. అలాంటప్పుడు వాటిని తీసుకోవడం చాలా ముఖ్యం. అప్పుడే పోషకాహారం తీసుకున్నట్లు. దీని వల్ల మీకు అన్ని పోషకాలు అందుతాయి. సీజన్‌లో దొరికే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. దీని వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది.


నెయ్యి..
బరువు తగ్గించడంలో హెల్దీ ఫ్యాట్స్ ఉన్న నెయ్యి చాలా హెల్ప్ చేస్తుంది. ఇందులో బాడీకి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్, కొవ్వులో కరిగే విటమిన్స్ ఉన్నాయి. అందుకే, కొద్ది మొత్తంలో నెయ్యి యాడ్ చేయండి. నెయ్యి తీసుకుంటే కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. దీంతో ఎక్కువగా తినం. బరువు తగ్గడంలో హెల్ప్ చేస్తుంది.

స్కిప్ చేయొద్దు..
బరువు తగ్గాలంటే కొంతమంది ఫుడ్‌ని తినడం మానేస్తారు. ఇది అస్సలు మంచిది కాదని న్యూట్రిషనిస్ట్ చెబుతున్నారు. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిల్లో హెచ్చు తగ్గులు ఉంటాయి. దీంతో ఎక్కువగా తర్వాత ఫుడ్ ఎక్కువగా తినాలనే కోరిక పుడుతుంది. కాబట్టి, బ్రేక్‌ఫాస్ట్, రాత్రి డిన్నర్‌లను కచ్చితంగా ఫాలో అవ్వాలని.. ఇందులో కార్బోహైడ్రేట్స్, ప్రోటీన్స్, హెల్దీ ఫ్యాట్స్ ఉండాలని న్యూట్రిషనిస్ట్ చెబుతున్నారు.

నమిలి తినాలి..
ఫుడ్‌ని హడావుడిగా తింటే దానిని మీరు ఆస్వాదించలేరు. పోషకాలు కూడా అందవు. కాబట్టి, తినేటప్పుడు ఇతర ఏ పనులు పెట్టకోకుండా ఫుడ్‌ని ఆస్వాదిస్తూ నములుతూ తినండి. దీని వల్ల మీరు ఎంత తిన్నారో తెలుస్తుంది. కడుపు నిండిన ఫీలింగ్ అందుతుంది.

స్ట్రెంథ్ ట్రైనింగ్..
అదే విధంగా, రోజుకి కొంత ఎక్సర్‌సైజ్ చేయడం చాలా ముఖ్యం. మరీ ముఖ్యంగా స్ట్రెంథ్ ట్రైనింగ్ వంటి ఎక్సర్‌సైజెస్ చేయాలి. దీని వల్ల ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి. జీవక్రియ పెరుగుతుంది. బరువు కూడా తగ్గుతుంది. హెల్దీ, ఫిట్‌గా ఉంటారు.

# కోరికలు తీర్చే కొమురువెల్లి మల్లన్న



**తెలంగాణాలోని ఓరుగల్లు ప్రాంతాన్నేలిన కాకతీయ రాజులు శివ భక్తి పరాయణులు. వారు పరమశివుని ఆరాధించటమేగాక, శివునిపట్ల తమ భక్తికి నిదర్శనంగా అనేక శివాలయాలు నిర్మించారు. వారు నిర్మించిన రామప్ప, వెయ్యి స్తంబాల గుడి, వగైరా అనేక ప్రసిద్ధ శివాలయాలను వరంగల్ జిల్లాలో నేటికీ దర్శించవచ్చు. అలాంటి దేవాలయాలలో ఒకటి కొమరవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం. పూర్వం ఇక్కడ కుమారస్వామి కొంతకాలం తపస్సు చేశాడని, అందుకే ఈ ప్రాంతానికి కుమారవెల్లి అనే పేరువచ్చి, కాలక్రమేణా కొమరవెల్లి అయిందంటారు. పరమ శివుడు ఇక్కడి తన భక్తులను కాపాడటానికి వీరశైవమతారాధకులైన మాదిరాజు, మాదమ్మ అనే దంపతులకు సుతుడై జన్మించి తన మహిమలతో భక్తులను కాపాడాడని క్షేత్ర పురాణం. తర్వాతకూడా తన భక్తుల రక్షణార్థం ఇక్కడే కొలువుతీరాడు.**

తెలంగాణలో ప్రసిద్ధ శివాలయాలలో కొమరవెల్లి మల్లన్న ఆలయం ఒకటి. కుమారస్వామి కొంత కాలం ఈ ప్రాంతంలో తపస్సు చేయడం వల్ల కుమారవెల్లి అని పేరు వచ్చి, కాలక్రమంలో 'కొమ-రవెల్లి'గా, వాడుకలో 'కొమ్రెల్లి'గా మారిందని చెబుతారు. ఈ క్షేత్రాన్ని అపర శ్రీశైలంగా భావిస్తారు. అక్కడికి వెళ్లలేని వారు ఈ మల్లన్నను దర్శించుకునే ఆనవాయితీ ఉంది. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారంనాడు కల్యాణోత్సవంతో మొదలయ్యే వార్షిక జాతర ఫాల్గుణ మాసం చివరి ఆదివారం (ఉగాది ముందు వచ్చే ఆదివారం) వరకు కొనసాగుతుంది. జాతర ప్రారంభం నాడే మల్లన్న కల్యాణం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు మూడు నెలల తరువాత 'అగ్నిగుండాలు' అనే కార్యక్రమంతో ముగుస్తాయి. జానపద సంప్రదాయాలకు కాణాచిగా పేర్కొనే తెలంగాణలో సంస్కృతీ సంప్రదాయాలకు కొమ ర వెల్లి మల్లికార్జునస్వామి జాతర మచ్చుతునక. ఏటా మార్గశిర మాసం చివరి ఆదివారం నిర్వ హించే ఆనవాయితీ ప్రకారం, సిద్ధిపేట జిల్లాలోని మండల కేంద్రం కొమరవెల్లిలో 11వ శతాబ్దంలో ఇంద్ర కీలాద్రి అనే కొండపై పరమశివుడు మల్లికార్జున స్వామిగా వెలసినట్లు స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. మల్లన్న మామూలుగా సంప్రదాయబద్ధంగా కని పించే లింగాకారంలో కాకుండా శిరస్సున పడగవిప్పిన నాగేంద్రుడు ఛత్రంగా, కోర మీసాలతో గంభీర రూపుడిగా, కోరమీసాలతో నిలువెత్తు విగ్రహంగా దర్శనమిస్తున్నాడు. మణి-మల్ల అనే రాక్షసులను సంహరించేందుకు పరమేశ్వరుడు మల్లాసురుగా అవతరించినట్లు బ్రహ్మాండ పురాణగాథ చెబు తుండగా, ఆయన శివుని కుమారుడని, ఎల్లమ్మకు సోదరుడని మల్లన్న జానపద్న కథలో వస్తుంది. వీరశైవమతారాధకులు మాదిరాజు, మాదమ్మ దంపతులకు పుత్రుడిగా జన్మించిన పరమేశ్వరుడు తన మహిమలతో భక్తులను కాపాడాడని, కాపాడుతున్నాడని స్థలపురాణాన్ని బట్టి తెలుస్తోంది. శివాంశసంభూతుడు శిరస్సున నాగేంద్రుడు పడగ విప్పి కనిపిస్తాడు. మల్లన్న పరమేశ్వరుడి అవతారమైన మార్తాండ భైరవుడు అని చెబుతారు. ఆయనను మహారాష్ట్రీయులు ఖండోబా అనే పేరిట పూజిస్తారు. ఆ రాష్ట్రంలోని నాందేడ్ జిల్లా మాలెగావ్ ప్రాంతంలో ఖండోబా (మల్లికార్జున స్వామి) ఆలయపూజారికి స్వామి కలలో కనిపించి 'కొమరవెల్లి కొండ గుహలలో వెలసినట్లు' చెప్పడంతో ఆ పూజారి ఇక్కడి వచ్చి, అక్కడ శివలింగం ఉండ దంతో పూజాదికాలు మొదలు పెట్టారట. కొన్నాళ్లకు ఆ శివలింగంపై పెరిగిన పుట్ట మట్టితోనే మాలెగావ్‌లోని స్వామి విగ్రహం తరహాలో ఇక్కడ మూర్తిని తయారు చేశారని తమ పూర్వికులు చెప్పినట్లు ఆలయ అర్చకులు పేర్కొంటున్నారు.



వందల ఏళ్లనాటి మృత్తికా విగ్రహం నాటి నుంచి పూజలందు కుంటున్నప్పటికీ చెక్కు చెదరకపోవడాన్ని విశేషంగా పేర్కొంటారు. మల్లన్న ఆలయా లు గ్రామ పొలిమేరల్లోనో, అడవుల్లోనో ఉంటాయి. కొత్తగా చేపట్టే ఆలయాలను ఊరి చివరే కట్టడం ఆనవాయితీ వస్తోంది. తమను అన్ని విధాల ఆదుకునే మల్లన్నను జానపదులు 'గ్రామరక్షకుడు'గా పరిగణిస్తారని పెద్దలు చెబుతారు.

(మిగతా 8వ పేజీలో)



(7వ పేజీతరువాయి)

కోరిన వరాలు ఇచ్చే కొండలలో వెలసిన కొండంత దేవుడు. నమ్మిన కొలిచిన వారిని నిరంతరం వెన్నంటి ఉంటూ సదా రక్షిస్తూ ఉంటాడు' భక్తుల విశ్వాసం.

### రెండు విధాల పూజలు

మల్లన్న దేవుడు యాదవ, లింగబలిజ సామాజిక వర్గాలకు చెందిన కేతమ్మ, మేడాలమ్మలను పెళ్లాడాడని కథనం. ఆ బాంధవ్యంతోనే ఆయా సామాజిక వర్గాల వారే ఆలయంలో పూజాదికాలు నిర్వహిస్తారు. ఇక్కడ రెండు రకాలు పూజా విధానాలు ఉన్నాయి. ఒకటి వీరశైవ ఆగమ శాస్త్ర విధానం కాగా, మరొకటి ఒగ్గు పూజారులు పూజా విధానం. మార్గశిర మాసం చివరి ఆదివారం నాడు ఆలయం తోటబావి ప్రాంగణంలో జరిగే మల్లన్న కేతమ్మ మేడాలమ్మ కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాల సమర్పణ ఆనవాయితీగా వస్తోంది. కల్యాణోత్సవాన్ని వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహిస్తారు. రెండు వంశాల వారు అంటే%ా % పగిడన్న వంశీయులు స్వామి వారి తరపున, మహాదేవుని వంశం వారు అమ్మవార్ల తరపున పెళ్లి తంతు నిర్వహిస్తారు. ఈ వార్షిక సంబరాలు స్వామి వారి కల్యాణోత్సవంతో మొదలై అగ్నిగుండాలనే కార్యక్రమంతో ముగుస్తాయి.

### సంక్రాంతి నుంచి ఉగాది వరకు

మకర సంక్రాంతి నుంచి ఉగాది వరకు ప్రతి ఆది, బుధవారాలలో మల్లన్న జాతర జరుగుతుంది. ఆ సమయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తారు. బోనం, 'పట్నం' అనే విశేష కార్యక్రమాలలో మొక్కుబడులు సమర్పించు కుంటారు. సంక్రాంతి తరువాతి ఆదివారాన్ని 'పట్నం' వారంగా, రెండవ ఆదివారాన్ని బోనాలను లష్కర్ వారం అంటారు. ఆ రెండు రోజులు జంటనగరాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ముఖ్యంగా, తమ ఆడబిడ్డ మేడలాదేవిని మల్లన్న వివాహమాడినందున ఈ వారాన్ని యాదవులు అత్యంత ప్రీతికరంగా భావిస్తారు. అలంకరించిన కొత్త కుండలో అన్నం వండి స్వామివారికి నివేదించడాన్ని బోనం అంటారు. పురుషులు ఎల్లమ్మ అవతారంలో చీర, గవ్వల పట్టీలు ధరించి బోనాలు సమర్పిస్తారు.


ఆయన సోదరిగా భావించే రేణుకాదేవికి బోనాల సమర్పణకు పసుపు కుంకాలతో అలంకరించిన పాత్రలపై దీపం వెలిగించి తలపై పెట్టుకుని భక్తులు బారులు తీరుతారు. కొందరు గజ్జెల లాగులు ధరించి వీర భద్రుడి వేషంలో వస్తారు. మరి కొందరు శివసత్తుల లాగా వస్తారు. వారి పాదతాడ నంతో పాపాలు నశిస్తాయని భక్తుల నమ్మకం. బోనం కుండలను శుభ్రపరచి పాలు పితకడం లాంటి నిత్యావసరాలకు ఉపయో గిస్తారు. అలా చేయడం వల్ల సంపద, ఆరోగ్యం, పశుగణాభివృద్ధి కలుగుతుందని విశ్వాసం.

జాతర చివరిలో అంటే కామదహనం (హోలీ) పండుగకు ముందు 'పెద్ద పట్నం' అనే కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రకృతి సిద్ధమైన అయిదు రంగులతో వేసే ముగ్గులను 'పట్నం'అని, అదే పరిమాణంలో భారీగా ఉంటే 'పెద్ద పట్నం' అంటారు. విశాలమైన ముగ్గు మధ్యకి స్వామిని ఆవాహన చేసి సాము హికంగా ఒగ్గులు వాయిస్తూ స్వామిని కీర్తిస్తారు ('పట్నం'లో వాడిన ముగ్గును జాతర తరువాత సేకరించి పంటపొలాల్లో చల్లుతారు).

మహాశివరాత్రిని లింగోద్భవ వారంగా వ్యవహరిస్తారు. లింగోద్భవ సమయంలో మల్లన్నకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఒగ్గు పూజారులు 49 వరుసలతో పెద్ద 'పట్నం' (ముగ్గు) వేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మల్లన్నస్వామి ఆలయానికి కొంత చేరువలో కొండపై కొలువుదీరిన రేణుకాదేవిని ఆయన సోదరిగా భావించి భక్తులు బోనాలు సమర్పిస్తారు, జాతర నిర్వహిస్తారు.

స్వామి వారి ఎడమ చేతి గిన్నెలోని భండారు (పసుపు పొడి)ను పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. ఆలయాన్ని సందర్శించే వారంతా తప్పనిసరిగా 'భండారు ప్రసాదం' స్వీకరిస్తారు. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు స్వామి వారి ప్రతిష్ఠ నాడే అంకుర రూపం దాల్చిందని చెబుతారు. స్వామిని దర్శించుకునే ముందు ఆ చెట్టుకు ప్రదక్షిణ చేస్తారు. మొక్కుబడిగా కొబ్బరికాయను వస్త్రంలో చుట్టి దానికి కడతారు. రావిచెట్టుకు, అక్కడి 'వరాల బండ'కు పూజలు చేస్తే సంతానం కలుగుతుందని నమ్ముతారు. ఆలయం ఎదురుగా రథం ఆకారంలో గల కట్టడాన్ని మల్లన్న రథంగా భావించి పూజిస్తారు.

ఉగాది ముందు ఆదివారం నిర్వహించే అగ్నిగుండాలతో జాతర ముగుస్తుంది. ఆ రోజు రాత్రి భారీ పరిమాణంలో సమిధలను పేర్చి మంత్రబద్ధంగా అగ్ని ప్రతిష్ఠ చేసి కణకణలాడే నిప్పుల మీదుగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మూడుసార్లు దాటిస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు వారిని అనుసరించి, మల్లన్న దర్శనం చేసుకుంటారు. గతంలో ఇక్కడ ఈ మూడునెలలో ఏడు వారాల పాటే జాతర (సత్తేటి వారాల జాతర) జరిగేదట. భక్తుల రద్దీ కూడా అంతంత మాత్రమే కావడంతో ఆలయం ఈ మాసాల్లోనే ఆలయం తెరిచి ఉండేది. రానురాను జాతర సమయంతో పాటు ఇతర సమయాల్లోనూ భక్తుల రద్దీ పెరగడంలో నిత్య పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. సుమారు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించే నీటి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం 'మల్లన్న సాగ' అని పేరు పెట్టింది.



### ఎలా చేరుకోవాలి?

హైదరాబాద్ నుంచి సుమారు 85 కి.మీ., వరంగల్ నుంచి 110 కి.మీ., సిద్దిపేట నుంచి 24 కి.మీ. దూరంలోని ఈ క్షేత్రానికి ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు అందుబాటులో ఉంటాయి. కొమరవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సమీపంలోని ఆకర్షించే పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. కొండ పోచమ్మ ఆలయానికి జాతర సమయంలో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. మల్లన్న ఆలయానికి సుమారు 28 కి.మీ. దూరంలోని కోటి లింగేశ్వర స్వామి, సుమారు 45 కి.మీ. దూరంలోని వర్గల్‌లోని శ్రీ విద్యా సరస్వతీదేవి ఆలయం ఉంది. తెలంగాణలో బాసర తరువాత విశేష ప్రాచుర్యం పొందిన జ్ఞాన దేవత ఆలయం ఇది.



# 'శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారికి అశ్రు నివాళి'

## మనసులో మాట



అందమైన జాబిలమ్మ వెన్నెల్లో నుంచి అచ్చ తెలుగు మహారాజువలె సాహిత్యమే ఊపిరిగా నింపుకొని దివి నుండి భువికి దిగివచ్చిన సాహితీ మాత ముద్దుబిడ్డ, ఆణిముత్యం మన సొమ్మపల్లి వెంకటసుబ్బయ్య గారు. అందాల హరివిల్లులతో దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉషోదయ కాంతులతో విలసిల్లే ప్రకాశం జిల్లా గన్నవరం లో శ్రీ సోమేపల్లి హనుమంతరావు గారు, శ్రీమతి నాగరత్నం గార్ల పావన మూర్తుల ఇంట జన్మించిన వరాల పుత్రుడు మన తెలుగు తేజం సోమేపల్లి వారు. ఈ సరస్వతి మాత ముద్దుబిడ్డ కామర్స్ లో మాస్టర్స్ డిగ్రీని విజయవంతంగా పూర్తి చేసి సరస్వతి దేవి మానస పుత్రునిగా కొనియాడ బడ్డారు. వీరి శ్రీమతి విజయలక్ష్మి గారు కూడా అన్నింట ముందుంచుతు వీరి ని వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ విజయఢంకా మ్రోగింపజే శారు. రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు శ్రీ వశిష్ఠ, శ్రీ విశ్వనాథ విరించి తండ్రిని మించిన తనయులు గా, సరస్వతి మాత ముద్దుబిడ్డలుగా భాసిల్లుతూ వారి వారి రంగాల్లో విజయ పథంలో ముందుకు దూసుకు వెడుతున్నారు. వీరు మొట్టమొదట ఆంధ్ర జ్యోతిలో జర్నలిస్టుగా విధులు ప్రారంభించారు. ఇలా జర్నలిస్టుగా ఎంతో గొప్పగా రాణిస్తూనే గ్రూప్-2 పరీక్షలకు ఎంతో శ్రద్ధగా చదివి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖలో ఎమ్మార్వో గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఈ ఉద్యోగరత్న తనకున్న పరిజ్ఞా నాన్నంతా ఉపయోగించి ఎమ్మార్వో గా, ఆర్డీవో గా, జడ్పీ సీఈవోగా, పులిచింతల ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా నెరవేర్చారు. జడ్పీ సీఈఓ గా 57 మండలాల ప్రజా సమ స్యల పరిష్కారానికి కృషిచేసి గుంటూరు జిల్లా అభివృద్ధికి దోహదపడ్డ అపర మేధావి మన సోమేపల్లి వారు. ఓ పక్క ఉద్యోగ బాధ్యతలని విజయవంతంగా నిర్వహిస్తూనే ప్రవృత్తిగా సాహితీ సేవలో అడుగు పెట్టారు.

ఇలా సరస్వతి దేవిని, సాహిత్యాన్ని ఉగ్గుపాలతో అవపోసన పట్టి అటువృత్తిని, ఇటు ప్రవృత్తిని సమ- పాళ్ళలో మేళవించి ఉద్యోగ ధర్మాన్ని నిర్వహించడమే దైవంగా భావిస్తూ, మరోపక్క రచనలే మానవసేవగా భావించి తనదైన బాణీలో ఎనలేని సేవలు అందిస్తూ రెండింటికి సమన్యాయం చేకూరుస్తూ ఈ బహుముఖ ప్రజ్ఞాశాలి అటు వృత్తిలోను ఇటు ప్రవృత్తిలోను ప్రథమ స్థానాన్ని సంపాదించుకున్నారు. గుంటూరు జిల్లా అధ్యక్ష పదవినలంకరించి కవి సమ్మేళనాలు, శతాధిక కవి సమ్మేళనాలు, కథల పోటీలు, పుస్తకావిష్కరణలు, ఎందరికో సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తూ బంగారానికి తావి అబ్బినట్లుగా ఉండి ఆ వ ద వి శే వన్నెతెచ్చారు. అందుకే కదు రసరమ్యం వీరి సాహితీ సేవలు. ఇంకా సోమేపల్లి పురస్కారం పేరుతో సాహిత్య రంగంలో విశిష్ట సేవలందించే ఎంతోమంది రచయితలకు ప్రతిభా పురస్కారాలు అందిస్తూ సాహితీ వినీలాకాశంలో ఓ ధ్రువతారలా నిలిచారు.

ఈ సాహితీ వనంలోని సాహితీ పూతోటలో విరబూసిన ఈ సాహితీ సుగంధ పుష్పం పరవళ్ళు తొక్కుతూ ఉరకల వేసే కృష్ణమ్మకు అతి చేరువులో గుంటూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘాన్ని కూడా స్థాపించి రాష్ట్రంలోని రచయితలందర్నీ ఒక్క త్రాటి మీదికి తెచ్చి అందర్నీ ప్రోత్సహిస్తూ సహస్ర కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ వారిలోని ప్రతిభాపాటలను వెలికితీస్తూ హ్యాట్రిక్ సాధిస్తూ సాహితీ రికార్డులను తిరగ రాశారు సోమేపల్లి వారు. ఈ అపర మేధావి ఒకవైపు సామాజిక చైతన్యాన్ని ఆవిష్కరిస్తూనే మరోపక్క జీవన విలువల్ని తెలియజేసే తదేక గీతం, తొలకరి చినుకులు, పచ్చని వెన్నెల, లోయలో మనిషిరెప్పల చప్పుడు, చల్లకవ్వం, నాగలి కి నా నమస్కారం, చేను చెక్కిన శిల్పాలు.... లాంటి ఎన్నో కవితా సంపుటాలను సాహితీ ప్రియులకు అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఓ రైతన్న ముద్దుబిడ్డగా జన్మించిన వీరు రైతన్నల ఈతి బాధలను, వారిలోని కృషి పట్టుదలను కవితా పాదాలుగా మలచి అద్దంలో ప్రతిబింబంలా సాహితీ పూఋతోటలో ఎంతో అందంగా విరబూయించారు.

ఈ ఉద్యోగరత్న మహిమాన్విత మూర్తి విధి నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ చేతుల మీదగా మూడుసార్లు రెడ్ క్రాస్ ప్రశంసా పత్రాలు, ఇంకా కలెక్టర్ చేతుల మీదుగా లెక్కకు మిన్నగా అవార్డులు అందుకున్నారు. ఈ కవి పుంగవుడు, కవి కోకిల సాహితీ రంగంలో చేసిన సేవలకు కూడా సోమిరెడ్డి జమునా పురస్కారం, ఆంధ్ర సారాస్వత సమితి మచిలీపట్నం వారి పురస్కారం, జన రంజక కవి ప్రతిభా పురస్కారం, అమరావతి సాహితీ మిత్రులు సాహితీ సంస్థ వారి ఉగాది పురస్కారం, ఇంకా అనేక పురస్కారాలను పొంది అటు సాహితీరంగంలోను ఇటు ప్రభుత్వ శాఖలోను చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోయారు. ఈ సేవా తత్పరుడు ఉద్యోగ విరమణ కి ముందు పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకొని సకల జనావళి హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. వీరి పెద్దకుమారుడు వీరి వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని రచనా రంగంలో రాణిస్తున్నారు. ఈ నిత్య కృషివలుడు, ఉద్యోగరత్న, సాహితీ బ్రహ్మ అందరి మదిలో 'తొలకరి చినుకులు' కురిపించి 'పచ్చని వెన్నెల' ఎలా ఉంటుందో చూపించి, తన 'రెప్పల చప్పుడు' తో 'లోయలో మనిషి' ఆంతర్యాన్ని తెలియజేసి, 'నాగలికి నమస్కారం' తెలియజేస్తూ 'చల్లకవ్వం'లా కూల్ కూల్ గా ఉండే 'చేను చెక్కిన శిల్పాలని'( యువ కవి రత్నాలు) సాహితీ పూతోటలో అందంగా విరబూయించి తాను విశ్రాంతి కోరుకుంటూ సాహితీ మాత ఒడిలో సేదతీరుతున్న మేధో సంపన్నుడు శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య గారికి అశ్రునివాళి.

పింగళి భాగ్యలక్ష్మి 9704725609

---

ఫేమస్ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ గోపరాజు హీరోగా పరిచయమైన సినిమా 'సర్కారు నౌకరి'. దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు నిర్మాత కావడం, 'పెద్ద రోగం చిన్న ఉపాయం' అంటూ విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తి పెంచాయి. ఎయిడ్స్ / హెచ్ఐవి నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ఎలా ఉంది?



కథ:

గోపాల్ (ఆకాష్ గోపరాజు) అనాథ. తల్లిదండ్రులు చిన్నప్పుడు మరణిస్తారు. అప్పటి నుంచి ఒంటరిగా పెరుగుతాడు. కష్టపడి మరీ సర్కారు నౌకరి (ప్రభుత్వ ఉద్యోగం) సంపాదిస్తాడు. సొంతూరైన కొల్లాపూర్ మండలంలో పెద్ద రోగం (ఎయిడ్స్ / హెచ్ఐవి) వ్యాప్తి అరికట్టడంతో పాటు దానిపై ప్రజల్లో అవగాహన కల్పించడం అతని పని. ప్రభుత్వ ఉద్యోగి కావడంతో అతను చేసే పని ఏంటనేది అడగకుండా సత్య (భావనా వళపందల్) పెళ్లి చేసుకుంటుంది. సర్కారు నౌకరి ఉన్న వ్యక్తికి భార్య అని ఊరంతా ఆమెను గౌరవిస్తుంది. తనకు లభిస్తున్న గౌరవ మర్యాదలు చూసి సంతోషిస్తుంది సత్య.

పెద్ద రోగంపై అవగాహన కల్పించడంలో భాగంగా గోపాల్ కండోమ్స్ పంచుతాడు. ఆ విషయం తెలిసి ప్రజలు... గోపాల్, సత్యను అంటరానివారిగా చూడటం మొదలు పెడతారు. దాంతో భర్తను ఉద్యోగం మానేయమని సత్య కోరుతుంది. స్నేహితుడు సైతం ఉద్యోగం మానేయమని చెబుతాడు. గోపాల్ మాత్రం ఎవరి మాట వినడు. దాంతో భార్య పుట్టింటికి వెళుతుంది. స్నేహితుడు మాట్లాడటం మానేస్తాడు. ఊరు ప్రజలందరూ అవమానిస్తారు. ఎన్ని సమస్యలు ఎదురైనా గోపాల్ ఉద్యోగం ఎందుకు మానలేదు? ఎయిడ్స్ నియంత్రించేందుకు ఏం చేశాడు? అతని గతం ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ:

ప్రతి కథ / సినిమాకు ప్రారంభం, ముగింపు చాలా ముఖ్యం. ప్రారంభం కాస్త అటు ఇటుగా ఉన్నా సరే ముగింపులో మెరుపులు ఉన్నప్పుడు ప్రేక్షకుడు సంతృప్తి చెందుతాడు. ముగింపు మనకు ముందు అర్థమైనప్పుడు థియేటర్లో చివరి వరకు కూర్చోవాలంటే కథనం, సన్నివేశాలు ఆసక్తిగా ఉండాలి. అటువంటివి లేనప్పుడు సహనానికి పరీక్ష తప్పదు.

'సర్కారు నౌకరి' ప్రారంభం ఆసక్తిగా ఉంటుంది. కొల్లాపూర్ వాతావరణం, పల్లెటూరి యువకుడిగా ఆకాష్ గోపరాజు పరిచయం, పెళ్లి, కండోమ్స్ గురించి అవగాహన లేని చిన్నారులు వాటితో ఆటలు ఆడుకోవడం నవ్విస్తాయి. ఆ తర్వాత నుంచి కథలో మలుపులు, కథనం ఏమాత్రం ఆసక్తిగా ముందుకు సాగలేదు. ముగింపు ముందుగా ఊహించేలా ఉంటుంది. హీరో గతం ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు.

'సర్కారు నౌకరి' కథలో బరువైన భావోద్వేగాలు ఉన్నాయి. కానీ, అవేవీ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా లేవు. కరోనా నేపథ్యం అయితే కాంటెంపరరీ, ఎయిడ్స్ / హెచ్ఐవి ఈ తరం ప్రేక్షకులు ఎంత మందికి తెలుసు? పాఠ్య పుస్తకాలు, వార్తల్లో చూడటం తప్ప. కథను 1996లో జరిగినట్టుగా చూపించారు. ఆ కాలంలో సినిమా తరహాలో గంగనమోని శేఖర్ రచన, దర్శకత్వం, ఛాయాగ్రహణం ఉన్నాయి. రెండు గంటల గవర్నమెంట్ యాడ్ తీసినట్టు ఉంది సినిమా. సహజత్వానికి దగ్గరగా తీయాలని అనుకోవడం తప్పు కాదు. కమర్షియల్ విలువలు అవసరం లేదు, కనీస ఆసక్తి కలిగించేలా ఉండాలి కదా. సినిమాలో అటువంటి అంశాలు లేవు. తనికెళ్ళ భరణి, త్రినాథ్ మధ్య కామెడీ ట్రాక్ అసలు నవ్వించలేదు.

శాండిల్య అందించిన స్వరాల్లో హీరో హీరోయిన్లకు పెళ్ళైన తర్వాత వచ్చే పాట వినసొంపుగా, కనువిందుగా ఉంది. మిగతా పాటలు ఏవీ గురించుకునేలా లేవు. రాఘవేంద్రరావు నిర్మాత కావడంతో ఆయన శైలి హీరో స్నేహితుడిగా నటించిన మహాదేవ్, ఆయన మరదలుగా నటించిన మధులతపై ఓ పాట తీశారు. ఆ సాంగ్ పిక్చరైజేషన్ బాలేదు. సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం పర్వాలేదు.

హీరో ఆకాష్ గోపరాజులో కెమెరా ఫియర్ కనిపించలేదు. తొలి సినిమా అయినప్పటికీ ఎమోషనల్ సీన్లలో చక్కగా నటించారు. హీరోయిన్ భావనా వళపందల్ తన పాత్రకు తగ్గట్టు నటించారు. హీరో హీరోయిన్ల లిప్ లాక్ సీన్లు కథలో భాగంగా ఉన్నాయి. ఇక, తనికెళ్ళ భరణి, సమ్మెట గాంధీ వంటి నటులను దర్శకుడు సరిగా ఉపయోగించుకోలేదు.

ఆకాష్ గోపరాజులో నటుడిని పూర్తి స్థాయిలో ఆవిష్కరించే సినిమా కాదిది. అతని నటన ప్రేక్షకులకు తెలియడానికి, విజయం కోసం మరొక సినిమా చేయక తప్పదు. 'సర్కారు నౌకరి'కి వెళ్ళడం అంటే రెండు గంటల గవర్నమెంట్ యాడ్ థియేటర్లలో చూడటానికి వెళ్ళడమే.

# సినిమా రివ్యూ

2017లో వచ్చిన 'మనీ హెయిస్ట్' వెబ్ సిరీస్ ప్రపంచవ్యాప్తంగా ఎంత పెద్ద సక్సెస్ అయిందో స్పెషల్‌గా చెప్పక్కర్లేదు. గ్లోబల్‌గా ఫ్యాన్‌బేస్‌ను దక్కించుకున్న ఈ సిరీస్ ఐదు సీజన్ల పాటు సాగిన తర్వాత 2021లో ఎండ్ కార్డు వేశారు. కానీ ఈ సిరీస్‌కు ఉన్న క్రేజ్ కారణంగా నెట్‌ఫ్లిక్స్ అంత త్వరగా 'మనీ హెయిస్ట్'ను వదలాలి అనుకోలేదు. మొదటి సీజన్‌లో బాగా ఫేమస్ అయిన 'బెర్లిన్' పాత్రను హీరోగా పెట్టి అదే పేరుతో వెబ్ సిరీస్‌ను తెరకెక్కించారు. ఈ సిరీస్ ఇప్పుడు విడుదల అయింది. మరి ఎలా ఉంది?



కథ:

బెర్లిన్ అలియాస్ ఆండ్రెస్ డె ఫొనొల్లోసా (పెడ్రో అలోన్సో) తన జీవితంలో 'మనీ హెయిస్ట్' సిరీస్‌కు ముందు చేసిన ఒక పెద్ద దొంగతనం నేపథ్యంలో ఈ సిరీస్ సాగుతుంది. పారిస్ నగరంలో 44 మిలియన్ యూరోల విలువ చేసే నగలను కొట్టేయడానికి బెర్లిన్ ఎటువంటి పథకం వేశాడు? ఈ పథకంలో ఎవరిని ఇన్వాల్వ్ చేశాడు? మనీహెయిస్ట్‌లో ఉన్న పాత్రలు ఇందులో ఏమైనా ఉన్నాయా? అన్నది తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్ ఎనిమిది ఎపిసోడ్లు చూడాల్సిందే!

విశ్లేషణ:

'మనీహెయిస్ట్' సిరీస్ సక్సెస్ అవ్వడానికి అతిపెద్ద కారణం పేరుకు తగ్గట్లే పూర్తిగా రాబరీ మీద ఫోకస్ చేయడం. దొంగతనం చేసే ముఠా ఎత్తులు వేయడం, బ్యాంకు లోపల ఉన్న దొంగలను పట్టుకోవడం కోసం బయట ఉన్న పోలీసులు వేసే పై ఎత్తులు, వాటికి చెక్ పెడుతూ బయట ఉన్న ప్రొఫెసర్ 'అంతకు మించి' అనిపించేలా ప్లానింగ్ చేయడం ఇవన్నీ ఆడియన్స్‌ను సీట్ ఎడ్జ్ మీద కూర్చోబెడతాయి. దొంగతనంలోనే డ్రామాను ఇన్వాల్వ్ చేయడం, పాత్రలను సైతం ప్రేక్షకులు ప్రేమించేలా చేయడం అతి పెద్ద ప్లస్ పాయింట్లు. అదే యూనివర్స్ నుంచి మరో సిరీస్ వస్తుందంటే ఆ సిరీస్ కూడా అదే స్థాయిలో ఉంటుందని ప్రేక్షకులు అంచనా వేస్తారు. ఆ అంచనాలను 'బెర్లిన్' ఏమాత్రం అందుకోలేకపోయింది.

'బెర్లిన్' సిరీస్‌లో అతి పెద్ద మైనస్ దొంగతనానికి తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం. ఈ సిరీస్‌లో మేకర్స్ కాన్సన్‌ట్రేషన్ రాబరీ కంటే బెర్లిన్ జీవితం మీద ఎక్కువగా ఉంది. బెర్లిన్ క్యారెక్టరైజేషన్ కూడా 'మనీహెయిస్ట్'లో కంటే కాస్త భిన్నంగా, సాఫ్ట్ అయిపోయినట్లు కనిపిస్తుంది. మనీ హెయిస్ట్ సిరీస్‌లో చూపించినంత కఠినంగా బెర్లిన్ ఈ సిరీస్‌లో కనిపించడు. రాబరీ కోసం బెర్లిన్ ఎవరిని అయితే ఎంచుకున్నాడో వారి బ్యాక్ స్టోరీలు కూడా ఇంట్రస్టింగ్‌గా ఉండవు. దీనికి తోడు వాటిని త్వరగా ముగించకుండా సాగదీశారు. మనీ హెయిస్ట్ సిరీస్‌ను నుంచి రెండు ఫిమేల్ క్యారెక్టర్లను కూడా ఇందులోకి తీసుకువచ్చారు. కానీ వాటి వల్ల వచ్చిన ఇంపాక్ట్ మాత్రం తక్కువే. టెక్నికల్‌గా మాత్రం 'బెర్లిన్' టాప్ నాచ్‌లో ఉంది. నేపథ్య సంగీతం, సినిమాటోగ్రఫీ, నిర్మాణ విలువలు అన్నీ అద్భుతంగా ఉన్నాయి. ఈ విషయంలో మాత్రం నెట్‌ఫ్లిక్స్ ఎక్కడా రాజీపడలేదు. సిరీస్ నిడివి కూడా చాలా ఎక్కువ. ఇందులో మొత్తం ఎనిమిది ఎపిసోడ్లు ఉన్నాయి. అన్నీ కలిపితే దాదాపు ఏడు గంటల వరకు నిడివి వచ్చింది.

ఇక నటీనటుల విషయానికి వస్తే...

బెర్లిన్ పాత్ర పోషించిన పెడ్రో అలోన్సోలో ఎంత పొటెన్షియల్ ఉందో మనీ హెయిస్ట్‌లోనే చూశాం. ఇందులో కూడా అతని నటన దాదాపు సిమిలర్‌గానే ఉంది.మిగతా నటీనటులందరూ తమ పాత్రల పరిధిలో బాగానే నటించారు. కానీ వారి పాత్రలకు అంత ప్రాధాన్యం లభించలేదు.

ఓవరాల్‌గా చెప్పాలంటే...

'మనీ హెయిస్ట్' సిరీస్‌ను మైండ్‌లో నుంచి తీసేసి చూస్తే 'బెర్లిన్' పర్లేదు అనిపిస్తుంది. ఆ రేంజ్ ఎక్స్‌పెక్ట్ చేస్తే మాత్రం కచ్చితంగా డిజప్పాయింట్ అవుతారు.

---

హీరో శివాజీ, 'తొలిప్రేమ' ఫేమ్ వాసుకీ ఆనంద్ సాయి ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'ఀ90'స్'. ఏ మిడిల్ క్లాస్ బయోపిక్... అనేది ఉపశీర్షిక. ఇది ఈటీవీ విన్ యాప్ ఒరిజినల్ సిరీస్. మొత్తం ఆరు ఎపిసోడ్స్ ఉన్నాయి. ఈ సిరీస్ ఎలా ఉంది?

కథ:

చంద్రశేఖర్ (శివాజీ)ది మిడిల్ క్లాస్ ఫ్యామిలీ. ఆయన భార్య పేరు రాణి (వాసుకీ ఆనంద్ సాయి). ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్దబ్బాయి పేరు రఘు (మౌళి తనూజ్ ప్రశాంత్), అమ్మాయి దివ్య (వాసంతిక), చిన్నోడు ఆదిత్య (రోహన్ రాయ్). చంద్రశేఖర్ గవర్నమెంట్ స్కూల్‌లో లెక్కల మాస్టారు. పిల్లల్ని ప్రైవేట్ స్కూల్‌లో జాయిన్ చేస్తాడు. ఆదిత్య పూర్ స్టూడెంట్. రఘు, దివ్య బాగా చదువుతారు. పదో తరగతిలో రఘుకు జిల్లా ఫస్ట్ ర్యాంక్ వస్తుందని ఆశిస్తారు. వచ్చిందా? క్లాస్‌మేట్ సుచిత్ర (స్నేహాల్ కామత్), రఘు మధ్య ఏం జరిగింది? చంద్రశేఖర్ ఇంట్లో ఉప్మా కథేంటి? మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో పిల్లలు, పెద్దల ఆలోచనలు ఎలా ఉన్నాయి? అనేది సిరీస్ చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ:

ఇప్పుడు పెద్దలతో పాటు పిల్లలదీ స్మార్ట్ లైఫ్. మన జీవితంలో ఫోన్ కూడా ఓ భాగమైంది. స్కూల్ బస్ టైమింగ్స్ నుంచి హోమ్ వర్క్ వరకు... గ్రీటింగ్ కార్డ్స్ నుంచి కమ్యూనికేషన్ వరకు... అన్నిటికీ ఫోన్ ఉంది. అందులో మెసేజ్ సెండ్ చేస్తున్నారు. కానీ, 90లలో జీవితం వేరు. అప్పటి జీవితాన్ని '90స్ – ఏ మిడిల్ క్లాస్ బయోపిక్'లో ఆవిష్కరించారు దర్శక నిర్మాతలు.

'90స్' వెబ్ సిరీస్ ప్రారంభంలో "మిడిల్ క్లాస్ లైఫ్‌లో పెద్ద కష్టాలు, కాన్‌ఫ్లిక్ట్స్ ఏం ఉండవు. బేసికల్లీ ఇది పెద్ద కథ ఏమీ కాదు. మన ఎక్స్‌పీరియన్స్, మెమరీస్ మాత్రమే" అని డైలాగ్ వినబడుతుంది. అది నిజమే. ఈ కథలో పెద్దగా కష్టాలు, కాన్‌ఫ్లిక్ట్స్ ఏం లేవు. ఇదొక సింపుల్ స్టోరీ. కానీ, చాలా మిడిల్ క్లాస్ కుటుంబాల్లో జరిగిన స్టోరీ. మధ్య తరగతి కుటుంబాల్లో పిల్లల భవిష్యత్ కోసం ఆలోచించే తల్లిదండ్రులు, నచ్చినవి చేయాలని ఆశపడే పిలల్లు, స్కూల్‌లో క్యూట్ %ఒ% లిటిల్ లవ్ స్టోరీస్... '90స్'లో ఉన్నవి ఇవే. అయితే... వాటిని అందంగా తెరకెక్కించారు దర్శక నిర్మాతలు.

'90స్ – ఏ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ'కి దర్శకుడు నవీన్ మేడారం ప్రజెంటర్. రాజశేఖర్ మేడారం నిర్మాత. మేడారం ఫ్యామిలీ ప్రొడక్షన్



వేల్యూస్ బావున్నాయి. 90లలో మిడిల్ క్లాస్ ఫ్యామిలీ వాతావరణాన్ని దర్శకుడు ఆదిత్య హాసన్ చక్కగా తెరపై ఆవిష్కరించారు. ఆ పల్స్ బాగా పట్టుకున్నారు. ముందు చెప్పినట్టు పెద్దగా కథ ఏమీ లేదు. కానీ, క్యూట్ %ఒ% లిటిల్ మూమెంట్స్ బావున్నాయి. సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం సన్నివేశాలు ప్రేక్షకులకు మరింత కనెక్ట్ అయ్యేలా చేసింది. '90స్' నవ్విస్తుంది. మధ్యలో కంటతడి పెట్టిస్తుంది. తండ్రి చేతిలో తిన్న దెబ్బలు గుర్తు చేస్తుంది. అమ్మ కష్టాన్ని కళ్లకు చూపిస్తుంది. 90లలో పిల్లలు ఒక్కసారి తమ చిన్నతనంలో వెళ్ళేలా చేస్తుంది.

చంద్రశేఖర్ పాత్రలో శివాజీని తప్ప మరొకరిని ఊహించుకోలేం. అంత సహజంగా నటించారు. ఇంటికి డీఈవో వచ్చినప్పుడు వైట్ షర్ట్ వేసుకుని వచ్చే సన్నివేశం ఆయనలోని నటుడిని మరోసారి గుర్తు చేస్తుంది. కరాటే నేర్చుకోమని అమ్మాయికి చెప్పడం, అంతకు ముందు అమ్మాయి పెద్దమనిషి అయినప్పుడు భార్యతో 'భయమే-స్తుంది' అని చెప్పే సన్నివేశాల్లోనూ శివాజీని చూస్తుంటే... మిడిల్ క్లాస్ తండ్రులందరికీ ప్రతినిధిగా కనిపిస్తారు.

మధ్య తరగతి గృహిణి రాణిగా వాసుకీ ఆనంద్ సాయిని చూస్తే 90లలో పిల్లలకు తమ తల్లి గుర్తుకు వస్తుంది. భర్తతో ఫైనాన్షియల్ ప్లానింగ్, ఇంట్లో పరిస్థితి గురించి చెప్పే సన్నివేశంలో ఆమె నటన గురించి ఎంత చెప్పినా తక్కువే. వాసుకి సెకండ్ ఇన్నింగ్స్ స్టార్టింగ్‌లో ఎప్పటికీ గుర్తుంచుకునే పాత్ర ఇది. ఈ సిరీస్ చూశాక ఆమెను దృష్టిలో పెట్టుకుని క్యారెక్టర్లు రాయవచ్చని దర్శక రచయితలు తప్పకుండా అనుకుంటారు.

రఘు పాత్రలో మౌళి నటన సహజంగా ఉంది. అతను చక్కగా చేశారు. 90 కిడ్స్ రఘు పాత్రలో, మౌళి నటనలో తమను తాము చూసుకుంటారు. వాసంతి, స్నేహాల్ కామత్ అందంగా నటించారు. చిన్నోడు రోహన్ అయితే పక్కా నవ్విస్తాడు. లాస్ట్ ఎపిసోడ్‌లో 'నీది నాదీ ఒకే కథ', 'విరాట పర్వం' చిత్రాల దర్శకుడు వేణు ఊడుగుల అతిథి పాత్రలో కనిపించారు.

అమ్మ ఉప్మా చేసిందని విసుక్కోవడం, మార్కులు తక్కువ వచ్చినప్పుడు నాన్న కొడతారని – తిడతారని భయం, క్లాస్‌లో నచ్చిన అమ్మాయి / అబ్బాయి మనల్ని చూస్తారో లేదోనని చిన్న సందేహం, చిన్న చిన్న విషయాల్లో సంతోషం వెతుక్కునే మధ్య తరగతి కుటుంబం... వీక్షకులకు '90స్' మంచి అనుభూతి ఇస్తుంది. ఉప్మా చాలా మంది నచ్చదు. కానీ, అమ్మ చేస్తే మాత్రం వదలకుండా తినేస్తాం. ఆ చేతిలో మేజిక్ అటువంటిది. '90స్' కూడా అంతే! అమ్మ చేతి ఉప్మా అంత రుచిగా ఉంటుందీ సిరీస్. హ్యాపీగా ఫ్యామిలీ అంతా కలిసి చూడొచ్చు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :

స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా॥ఈడ్పుగంటి పద్మజారాణి

91 9849250852,

91 7506976164

padma.suryapaper@gmail.com




# 7.1.2024 నుంచి 13.1.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోకొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తి గత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కుటుంబ వార్తలను ఆహ్లాదకరంగా ఉంటుంది ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలోమాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. ప్రయాణాలలో వస్తువులు జాగ్రత్తగా పెట్టుకోవాలి, కొత్త వ్యక్తులన్నీ తొందరపాటు గా నమ్మడంలో జాగ్రత్త అవసరం. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. సంతానముతో, ఆత్మీయ వ్యక్తుల తో ఆహ్లాదకరంగా గడుపుతారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. వారం మధ్యలోవృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాగ్వాదములకు దూరంగా ఉండాలి. భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ప్రారంభం సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామ్ కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. కుటుంబములోని స్త్రీల ఆరోగ్య, ఆదాయం అభివృద్ధికరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువులకు నూతన అవకాశములు కొరకు మీ సహకారం ఉంటుంది. వారం మధ్యలోవిదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలంగా ఉంటాయి. స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. ఎంతోకాలం ఎదురుచూస్తున్న దూర ప్రదేశంలో నుంచి అందుకున్న ఒక వార్త ఆనందాన్నిస్తుంది.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభంలోనిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు. మిత్రుల ల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. వారము మధ్యలో విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. గృహవాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు. దానివలన వృత్తిపరమైన అలసట, అనారోగ్య భావనలు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలోయదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. వారం మధ్యలో దూర ప్రయాణాల కొరకు ప్రణాళికలు వేసుకుంటారు.వ్యక్తుల సహకారం పెరుగుతుంది. ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు చేయడము లో చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభశారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగుతాయి. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తి స్థాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లి తరపు బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు కొరకు తోబుట్టువులతో సంప్రదిస్తారు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంఆధ్యాత్మిక ఆలోచనలతో స్వాగతం పలుకుతారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. దూర ప్రయాణములలో కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. వారము మధ్యలో సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు. ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

ప్రారంభం కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమైన అభివృద్ధితో, మొదలవుతుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. తండ్రి నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. వృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. వారం మధ్యలో ఆధ్యాత్మిక పుణ్య క్షేత్ర సందర్శనతో, నదీ స్నానాలు, గురువులను కలవడం వారి ఆశీస్సులు తీసుకోవడం, కొత్త ప్రదేశాలకు విరాళాలు ఇవ్వడం. సమయానికి నిద్ర, ఆహార స్వీకరణ అవసరం. నూతన విషయాలు తెలుసుకుంటారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. నూతన విషయాలు నేర్చుకుంటారు. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు.భూమికి సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. వారం మధ్యలో భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్య క్షేత్రాన్ని సందర్శిస్తారు. సంతాన సంబంధ విద్యా ఆరోగ్య అభివృద్ధి అంశములలో కొన్ని ఉద్వేగాలకు లోనవుతారు. ఒక వార్త ఘర్షణతో కూడిన ఆనందాన్నిస్తుంది.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభం విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు.ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధీర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి.అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవిసంతోషాన్ని, ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. వారం మధ్యలోవృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. నూతన గృహ వాహన కొనుగోలు అంశములలో ఆచితూచి అడుగు వేయాలి. వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించటమేలు. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి.ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. వారం మధ్యలో గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. వారం చివరిలోఆత్మీయ మిత్రుల సహకారాన్ని కోరుకుంటారు. ఖరీదైన వాహన కొనుగోలు కొరకు చేయు ప్రయత్నాలు ముందుకు వెళతాయి.


శ్రీలీల